# ఆదర్శ పాలన అందిస్తున్న సీఎం చంద్రబాబు



❍ **మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు**

❍ **యర్రబాలెం వాల్మీకి మహర్షి ఆలయ సందర్శన**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పరిపూర్ణ మానవత్వానికి ప్రతిరూపం శ్రీరాముడు అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీరాముడు మార్గంలో ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నారని మాజీమంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కొనియాడారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం పారిశ్రామిక వాడలోని వాల్మీకి మహర్షి ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మాజీమంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ యువ నాయకులు నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిధి యర్రబాలెం లోని వాల్మీకి మహర్షి ఆలయాన్ని సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. చిన్నచిన్న కూలీ పనులు చేసుకుని పేదరికంలో ఉన్న వాల్మీకి బోయ బంధువులందరూ కలిసి ఐకమత్యంతో ఈ ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.

శ్రీరాముడు జీవనాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత ప్రమాణాలతో జీవించాలనుకునే కోట్లాదిమందికి శ్రీరామనవమి పండుగ రోజు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. మహానుభావుడు శ్రీరాముడు మనందరికీ మార్గదర్శి అని, పరిపూర్ణమైన మానవత్వానికి ఆయన ప్రతిరూపమన్నారు. ధర్మానికి సత్యనిష్టకు, పరిపాలనకు, దాంపత్య జీవనానికి శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సతీ పతుల జీవనంలో గానీ, అన్నదమ్ముల బాంధవ్యంలో గానీ, తండ్రి కొడుకుల వాత్సల్యంలో గానీ రామాయణం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అటువంటి అద్భుతమైన రామాయణం రచయిత మహర్షి వాల్మీకి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి తమ ఆది పురుషుడని చెప్పుకునే జాతి తమదన్నారు. రాష్ట్రంలోని లక్షలాదిమంది వాల్మీకి బోయలు వాల్మీకి మహర్షిని దైవంగా భావిస్తూ జీవనం గడుపుతున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాముడు చూపిన మార్గంలో రాష్ట్రంలో ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. అన్ని వర్గాల సంక్షేమం, అలాగే అన్ని ప్రాంతాల అభివృద్ధి చేపడుతూ సీఎం చంద్రబాబు ఆదర్శంగా పరిపాలన చేస్తున్నారన్నారు.

యువ నాయకుడు నారా లోకేష్ మంగళగిరి శాసనసభ్యుడు కావడం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న పూర్వజన్మ సుకృతమే కాకుండా అదృష్టం కూడా అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో సాగిస్తున్న ప్రగతి ప్రయాణం స్ఫూర్తిదాయకమైనదని, అందరికీ ఆదర్శనీయమైనదని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళ్యాణ ఆనంద స్వామీజీ, వాల్మీకి బోయ సంఘ ప్రతినిధులు నల్ల బోతుల లక్ష్మణ, కామినేని సాంబశివరావు, నల్లబో తుల సుబ్బారావు, చొప్పవరపు గోపి, బోడ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని బాటలో చంద్రన్న పాలన

❍ **శోభాయాత్రలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు శ్రీ రామచంద్ర శ్రీరామచంద్రమూర్తి బాటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శ్రీ రామనవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం గుంటూరు నగరంలో చేపట్టిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు ఎమ్మెల్యే నసీర్ మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేశారు.. తండ్రి మాట జవదాటని పుత్రునిగా శ్రీరామచంద్రమూర్తి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. గురువూరు పట్ల ఎలాంటి భక్తిశ్రద్ధలు కనపర్చాలో శ్రీరాముడు పాటించి చూపించారని పేర్కొన్నారు.

శ్రీరామనవమి సందర్భంగా గుంటూరులో చేపట్టిన శోభాయాత్ర అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో సాగిందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో శ్రీరాములవి వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాను ఎన్ని కష్టాలు పడినా ప్రజలకు సుభిక్ష పాలన అందించాలనే ధ్యేయంతో తన జీవితాన్ని కొనసాగించిన శ్రీరాముని స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో గొప్ప పాలన అందిస్తున్నారని చెప్పారు.

## శ్రీరామ నవమి శోభాయాత్రను పచ్చజెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

❍ **గుంటూరులో శ్రీరామ నవమి శోభాయాత్ర**

❍ **కోరిటేపాడు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గుంటూరు నగరంలో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుండి శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామ శోభాయాత్రను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పచ్చజెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...లి గత తొమ్మిదేళ్లుగా నిరంతరంగా శోభాయాత్రను నిర్వహించడం ఎంతో శుభపరిణామమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తి భావం, ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని, శ్రీరాముడు చూపించిన సత్యం, ధర్మం, న్యాయం మార్గాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

అదేవిధంగా, కోరిటేపాడు రామాలయంలో శ్రీ రామనవమి సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి శ్రీ సీతారాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడని, ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలిపారు. గుంటూరు నగర ప్రజలందరికీ శ్రీరామ నవమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాటూరి శిల్పుల ప్రతిభా వైభవం బాలరాముని తేజోరూపం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): విశ్వామిత్రుడు సృష్టికి ప్రతిసృష్టి చేసిన తీరుగా కాటూరి శిల్పులు తమ శిల్పకళానైపుణ్యంతొ అద్భుతాలను ఆవిష్కరిస్తున్నారు.

పట్టణానికి చెందిన సూర్య శిల్ప శాల శిల్పులు శ్రీరామ నవమి పర్వదినవేళ అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించారు. అయోధ్యలోని బాల రాముడి విగ్రహాన్ని, అత్యద్భుతంగా తీర్చిదిద్ది భక్తుల నలరించారు. శుక్రవారం ఉదయం నుండి శిల్పశాల వద్ద ప్రదర్శనగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు ఐదు నెలల పాటు శ్రమించి 4.5 అడుగుల ఎత్తులో 50 కేజీల బరువుతో త్రీ డి టెక్నాలజీతో అయోధ్య బాల రాముని విగ్రహాన్ని తయారు చేసినట్లు శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీ హర్ష లు, బాలరాముని మలచిన తీరును వివరించారు.

# గోకుల క్షేత్రంలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు



**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్):** తాడేపల్లి బైపాస్ కొలనుకొండ హరే కృష్ణ గోకుల క్షేత్రం లో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైష్ణవుల మంత్రోచ్చ రణలతో, హరి నమ భజన కీర్తనల నడుమ శ్రీ సీతా రాములను పంచ గవ్య, పంచ అమృతం, ద్వాదశ ఫల రసాలతో, 11 అరతులతో, 108 గంగ జలాలతో మరియు 24 రకాల పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. రామదాసు కీర్తనలతో డోలోత్సవ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు పానకం, వడపప్పు, అన్న ప్రసాదాలను వితరణ చేశారు. రామనామ జపంతో ఆలయం అంత మార్మోగిపోయాయి. గోకుల క్షేత్రం లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో ఆలయ అధ్యక్షులు వంశధార దాస మాట్లాడుతూ మనం భగవంతుని నామ జపం చేసి శ్రీ రామ చంద్రుని అనుగ్రహాన్ని పొందవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు దాతలు, పెద్దలు, సేవకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## అందరికీ సకల శుభాలు కలగాలి : అప్పిరెడ్డి అభిలాష



❍ **శ్రీరామనవమి వేడుకలలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీరామ నవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ సీతారాముల దీవెనలతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని.. రాష్ట్రానికి మంచి జరగాలని.. ఆయన ఆకాంక్షించారు.

బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి హాజరై శ్రీరాముడికి విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, హిందూ ధర్మంలో శ్రీరామచంద్రుడు అవతారం అత్యంత అద్వితీయమని తెలిపారు. తండ్రి మాట జవదాటని తనయుడిగా.. ఏకపత్నీవ్రతుడుగా.. సత్య ధర్మ పరిపాలకుడిగా.. ఇలా చెప్పుకుంటూ పోతే రాముడి గుణగణాలు కోకొల్లలని వివరించారు. అందుకే రామాయణం, "కనగ కనగ కమణీయం – వినగ వినగ రమణీయం" అయిందని ఆయన వ్యాఖ్యానించారు. ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు అయిన ఆ శ్రీరాముడి కరుణా కటాక్ష వీక్షణాలు అందరిపై సమానంగా ప్రసరించాలన్న అభిలాషను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యక్తం చేశారు.

ఈ వేడుకలలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు ఒర్చు శ్రీనివాసరావు, పరసా కృష్ణారావు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, సుందరరావు, ఇర్మియా, సుబ్బరాజు, రేజేటి నవీన్, రెడ్డి కోటేశ్వరరావు, శంకర్, చిన్న, వలివేటి వెంకటరమణ, నారాయణ, వనజాక్షి, జాన్సన్, బుజ్జి, నీలి, నరేష్, బాజి, రవీంద్ర, వలి తదితరులు పాల్గొన్నారు.

### ఐజేయూ సమావేశాలకు వాటర్ బాటిల్ పంపిణీ




**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** విజయవాడలో నిర్వహిస్తున్న ఐజేయు 11వ ప్లీనరీ సభల కోసం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందినటువంటి ఏపీయూడబ్ల్యూజే నాయకులు మూడు రోజులకు అవసరమైనటువంటి మంచినీటి బాటిల్స్ ను అందజేశారు.

శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్ వద్ద ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావుకు ఈ పదివేల బాటిల్స్ ను పత్తిపాడు నియోజకవర్గ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు మాట్లాడుతూ మూడు రోజులపాటు కావలసిన మంచినీటి బాటిల్స్ లను అందజేసినందుకు పత్తిపాడు నియోజకవర్గ కమిటీని అభినందించారు. వీరిలో పత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు జోగి ఆనంద్ ఐజేయూ సభ్యులు కొంగర వెంకట సుబ్బయ్య చౌదరి, చందు సుబ్బారావు గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు ఎస్ ఎం డి షరీఫ్, పోనకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68


# నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో పని చేయాలి







❍ **ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్**

❍ **విజ్ఞాన్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం**

❍ **ఘనంగా రీసెర్చ్ నెక్సస్ జర్నల్ ఆవిష్కరణ**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు ఎక్కడ పని చేసినా నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని.. వారి అభివృద్ధితో దేశ అభివృద్ధి కూడా జరుగుతుందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చదువుతూ ఈ ఏడాది ప్రాంగణ ఎంపికల ద్వారా ఆయా సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శుక్రవారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఘన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూనివర్సిటీలో ఈ ఏడాది మొత్తం 1100 మందికి పైగా విద్యార్థులు ప్రాంగణ ఎంపికల ద్వారా 100కు పైగా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మొత్తం మీద 80 శాతం మంది విద్యార్థులు ఆయా సంస్థల్లో కొలువులు కొల్లగొట్టారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మనిషి ప్రవర్తనలో 70 శాతం ప్రభావం చూపే నైతిక విలువలు, సంస్కృతి, వారసత్వం, ధార్మికత వంటి అంశాలు ఎక్కడా బోధించబడడం లేదు అనే ఆలోచన తనను ఎప్పుడూ ఆలోచనలో పడేస్తుందని పేర్కొన్నారు. విద్యలో నైతిక విలువలు లేకపోతే అది యాంత్రికంగా మారి, సమాజానికి ఉపయోగపడదని తెలిపారు. పూర్వం 'మోరల్ సైన్స్' అనే విషయం ద్వారా కథల రూపంలో నీతిపాఠాలు బోధించేవారని, ప్రస్తుతం ఆ పద్ధతి విద్యా వ్యవస్థలో తగ్గిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విజ్ఞాన విశ్వవిద్యాలయం తల్లిదండ్రులను గౌరవించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రుల త్యాగం అమూల్యమని, వారి చేసిన కృషి కోట్ల రూపాయలతో కూడా కొలవలేనిదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు త్యాగం చేయకపోతే విద్యార్థులు ఈ స్థాయికి చేరుకునే అవకాశం ఉండేదే కాదని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల విలువను తాము తల్లిదండ్రులయ్యాక మాత్రమే అర్థం చేసుకుంటారని, అప్పటికి ఆలస్యం కావచ్చని హెచ్చరించారు. అందుకే తల్లిదండ్రులకు కృతజ్ఞత తెలిపే ఈ కార్యక్రమం ఎంతో విలువైనదని చెప్పారు. భారతదేశం తన సంస్కృతి, తల్లిదండ్రుల త్యాగాల వల్లనే వలస పాలనలను అధిగమించగలిగిందని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రభుత్వం విద్యా రంగంలో చేసిన పెట్టుబడులు దేశ అభివృద్ధికి కీలకమయ్యాయని చెప్పారు. అయితే సమాజంపై బాధ్యత లేకపోతే ఆవిష్కరణలు కూడా విధ్వంసానికి దారి తీస్తాయని, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అందువల్ల యువత తమ జ్ఞానాన్ని మానవాళి అభ్యున్నతికి ఉపయోగించాలన్నారు. తల్లిదండ్రులు ప్రతిఫలం ఆశించకుండా త్యాగం చేస్తారని, వారికి చివరి దశలో ప్రేమ, పరిరక్షణ ఇవ్వడం మాత్రమే విద్యార్థుల బాధ్యత అని చెప్పారు. విద్యాసంస్థలు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా నైతిక విలువలను కూడా బోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ విషయంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ప్రత్యేక విధానాలను అవలంబించడం అభినందనీయమన్నారు. అధ్యాపకులు కూడా తమ జ్ఞానాన్ని సమకాలీనంగా నవీకరించుకోవాలని, పరిశ్రమల్లో శిక్షణ పొందడం ద్వారా తాజా పరిజ్ఞానం విద్యార్థులకు అందించాలని సూచించారు. విజ్ఞాన్స్ వర్సిటీ విద్యతో పాటు నీతి, నైతికతలను సమన్వయం చేయడంలో ముందంజలో ఉందని, ఇది సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని టీసీఎస్ -- ఇండస్ట్రీ సొల్యూషన్ యూనిట్ హెడ్ భీమశేఖర్ ఆత్మకూరు మాట్లాడుతూ తల్లిదండ్రులను సత్కరించడం వెనుక ఉన్న భావం ఎంతో లోతైనదని, వారి త్యాగాన్ని గుర్తించే ప్రయత్నమని పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుందని, శ్రీరాముడు తన జీవితంలో ఎదురైన ప్రతి సవాలును అవకాశంగా మార్చుకుని విజయం సాధించినట్లే, విద్యార్థులు కూడా సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. విద్యార్థుల విజయాలు ఒక్కసారితో ముగియకూడదని, నిరంతరంగా కొనసాగాలని, అందుకు స్వయంగా ప్రేరణ పొందుతూ ఇతరులకు కూడా ఆదర్శంగా నిలవాలని చెప్పారు. తల్లిదండ్రులకు లభించే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే 'కోడ్ విటా' పోటీలో విజ్ఞాన విద్యార్థి విజయం సాధించడం విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను పెంచిందన్నారు. విజ్ఞాన విశ్వవిద్యాలయ లోగోలో ఉన్న భావం ఎంతో లోతైనదని, అది జ్ఞానం, వివేకం, వికాసం, సేవ, విశిష్టత వంటి విలువలను ప్రతిబింబిస్తుందని వివరించారు. విద్యార్థులు ఈ విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. ఆలుమ్ని వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా విద్యాసంస్థ అభివృద్ధి చెందుతుందని, ఐఐటీలు, ఎన్ఐటీలు విజయానికి ఇదే ప్రధాన కారణమని పేర్కొన్నారు. విద్యార్థులు పరస్పరం అనుసంధానంగా ఉండి, భవిష్యత్ తరాలకు మార్గదర్శకత్వం ఇవ్వాలని సూచించారు.

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మన రాష్ట్రంలోనే ఒక్క విజ్ఞాన్ యూనివర్సిటీ మాత్రమే ఇలా తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని శ్రీరామనవమి పర్వదినాన అనవాయితీగా నిర్వహిస్తోందని తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన 1100 మంది పిల్లలు ఇంత క్లిష్ట సమయంలో కూడా చాలా పెద్ద సంఖ్యలో మంచి ఉద్యోగాలు సాధించగలిగారని ఆనందం వ్యక్తం చేశారు. వీరు ఉద్యోగాలు సాధించడం వలన వాళ్ల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మార్చడం, వర్సిటీలో చేరిన మొదటి నాలుగునెలల్లోనే విద్యార్థులను ఇంటర్ విద్యావ్యవస్థ నుంచి పూర్తిగా బయటకు వచ్చేలా చేయగలగడం, విజ్ఞాన్‌లో చేరే పిల్లల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నారనే ఉద్దేశంతో కేంబ్రిడ్జి యూనివర్సిటీ సహకారంతో ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడం, నాయకత్వ స్ఫూర్తి, సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించడం కోసం ప్రత్యేక శిక్షణలు కొనసాగించడం, విద్యార్థులతో అధ్యాపక బృందం నిరంతరం మద్దతుగా నిలబడటం లాంటి అంశాల వల్ల విద్యార్థులు విజయం సాధించగలిగారని వివరించారు.

విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అంశాల్లో చాలా బాగుండబట్టే ఈ స్థాయిలో ఉన్నత ఉద్యోగాలు సాధించగలిగారని తెలిపారు. ఈ ఉద్యోగంతోనే అంతా సాధించినట్టు కాదని, అసలు సిసలు జీవితం ఇక ఇప్పటి నుంచే మొదలు కానుందని విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఏఐ రాకతో మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు రావడం ఎంతో కష్టంగా ఉందని, కాబట్టి విద్యార్థులు ఎప్పటికప్పుడు స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. మీరు చేసే ప్రతి పనిని ధర్మంగా, బాధ్యతతో చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వర్సిటీలో ప్రతినెల ప్రచురించబోయే రీసెర్చ్ నెక్సస్ జర్నల్‌ను ఆవిష్కరణ ఆవిష్కరించారు. తర్వాత ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులందరికీ ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘన సత్కారం అందజేశారు.

కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుద్దపల్లి నాగరాజు సేవదృక్పదం అభినందనీయం



○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మేరీమాత దీక్షాధారులకు ప్రేమ విందు ఏర్పాటు చేయడం సంతోషదాయకమని, సుద్దపల్లి నాగరాజు సేవా దృక్పదం అభినందనీయమని, ప్రేమ విందు ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు,జడ్పీ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. చెంచుపేటలోని ఆర్సీఎం చర్చి వద్ద మేరీమాత దీక్ష స్వీకరించిన 500 మందికి,మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రేమ విందు ఏర్పాటు చేయగా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు,జడ్పీ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా విశిష్ట అతిథులు విచ్చేసి దీక్ష ధారులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రేమ మూర్తి, మేరీమాత దీక్షతీసుకున్న వారికీ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వేమూరు ఎమ్మెల్యే .నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహించే సుద్దపల్లి నాగరాజు, మరిన్ని సేవలతొ ఉన్నతంగా రాణించాలన్నారు. జడ్పీ చైర్ పర్సన్ హెని క్రిస్టినా మాట్లాడుతూ సుద్దపల్లి నాగరాజు ఇలాంటి సేవ కార్యక్రమాలు భవిష్యత్ లో మరెన్నో చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్,జనసేన నాయకులు గౌరీ శంకర్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో –కన్వీనర్ ఉన్నం ధర్మారావు మాదిగ, హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర డేవిడ్ యస్వంత్,కొలకలూరి కిరణ్ కుమార్,అత్తోట శరత్,నలుకుర్తి రమేష్,లింగాల రమేష్,బోస్ బాబు,రావూరి సతీష్,కోట్ల దిలీప్,కొక్కిలిగడ్డ సునీల్,అనే రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



## ఎడ్ల బలప్రదర్శన వేదిక ద్వారా రైతులకు వినోదం కూడిన వ్యవసాయ విజ్ఞానం



○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఉగాది, శ్రీరామ నవమి తర్వాత, పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రారంభమయ్యే ఒంగోలు జాతి ఎడ్ల,జాతీయ స్థాయి బలప్రదర్శన, ఆవుల పాల ప్రదర్శన పోటీలలో రైతులకు వినోదం విజ్ఞానం రెండూ లభిస్తాయని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక చెంచుపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలొ శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఎడ్ల బల ప్రదర్శన, ఆవుల పాలప్రదర్శనా వివరాల బ్రోచర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు రైతులందరి ఉత్సవంగా ప్రారంభమయ్యే, ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలతొ పాటుగా, రైతులకు వ్యవసాయ పరంగా ఏర్పాటు చేసే స్టాల్స్, వ్యవసాయ శాస్త్ర వేత్తల సూచనల సెమినార్ లు ప్రత్యేకతను చాటుకోనున్నాయని అన్నారు. ఏప్రిల్ 4వరకు నిర్వహించే వేడుకలు ప్రారంభ కార్యక్రమంలొ స్థానిక మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్, హోమ్ మంత్రి వంగల అనిత, ట్రైబల్ వెల్ ఫేర్ శాఖ మంత్రిణి గుమ్మడి సంధ్యారాణి తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను చాటుకునే పోటీలకు సహకరిస్తున్న స్థానిక పార్టీ శ్రేణులకు, బహుమతుకు తోడ్పాటుగా సహకరించే ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈసమావేశంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర, పార్టీ పట్టణ అద్యక్షులు మహ్మద్ కుద్దూస్, రావి చిన్ని, కేశన కోటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, మైనేని రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన సుంకాల తగ్గింపుతో ప్రజలకు ఊరట



○ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 10 ఎక్సైజ్ సుంకం తగ్గించడం, డీజిల్‌పై ఉన్న సుంకాన్ని పూర్తిగా రద్దు చేయడం ద్వారా ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వంగా ఎన్డీఏ మరోసారి నిరూపించుకుందని అన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఇంధన రంగంపై పడుతున్న సమయంలో, ఆ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంధన ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతమైందని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు. ఇంధన కొరత రాకుండా చర్యలు తీసుకుంటూనే, ప్రజలకు ఊరటనిస్తూ ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా గుంటూరులో శ్రీరామ నవమి శోభాయాత్ర







**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో రామభక్తులు, హనుమాన్ భక్తులు, హిందువులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నగర వీధులను నింపారు.

ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు కారం శెట్టి లోకేష్ గుప్తా మాట్లాడుతూ, గుంటూరులో గత 8 ఏళ్లుగా గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానం నుండి శ్రీరామ నవమి శోభాయాత్రను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది తొమ్మిదోసారి ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ శోభాయాత్ర గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానం నుంచి ప్రారంభమై పట్టాభిపురం, నగరంపాలెం, హనుమాన్ సెంటర్, బస్టాండ్, పాత గుంటూరు, చందన బ్రదర్స్, పట్నం బజార్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మీదుగా రామనామ క్షేత్రం వరకు సాగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామి హాజరై జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గల్లా మాధవి, నసీర్ అహ్మద్, కన్నా లక్ష్మీనారాయణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవ సమితి కార్యకర్తలు వేణుగోపాల్, చల్లా బ్రహ్మారెడ్డి, ఫణీంద్ర, చరణ్, మధు, ప్రవీణ్ అంకారావు, జానకి, సుబ్బారావు, సంజీవ్ తదితరులు ముందుండి యాత్రను విజయవంతంగా నిర్వహించారు. నగరంలో భక్తి వాతావరణం నెలకొని శ్రీరామ నామస్మరణతో మార్మోగింది.



## రామభక్తులపై దాడి ఘటనపై మాధవ్ తీవ్ర ఆగ్రహం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద్దపేట గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి. ఆలయ దర్శనానికి వెళ్లిన భక్తులపై దాడి జరగడం పట్ల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెద్దపేటలోని రామాలయాన్ని దర్శించేందుకు వెళ్లిన రాష్ట్ర ఉప సభాపతి కోన రఘురామకృష్ణరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులను లక్ష్యంగా చేసుకుని దాడి జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకోవడం మాత్రమే కాకుండా భక్తులపై హింసకు పాల్పడటం సమాజంలో ఆందోళనకు దారి తీస్తోందన్నారు.

మత మార్పిడులను కారణంగా చూపుతూ పురాతన హిందూ దేవాలయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం రాజ్యాంగానికి విరుద్ధమని పివిఎన్ మాధవ్ స్పష్టం చేశారు. ఈ తరహా సంఘటనలు మత సామరస్యానికి భంగం కలిగిస్తాయని ఆయన హెచ్చరించారు.

ఆకివీడు ఘటనతో హిందూ సమాజంలో అనేక సందేహాలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. మత మార్పిడి జరిగితే ఆ ప్రాంత సంస్కృతి, చరిత్ర మారిపోతుందా? పురాతన ఆలయాల ఉనికి ప్రమాదంలో పడుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు అందరినీ కలవరపెడుతున్నాయని పేర్కొన్నారు.

ఈ ఘటనను ధర్మంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, దీనిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని ఆయన సూచించారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, భక్తులకు భద్రత కల్పించాలని, దేవాలయాల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మతం మారినప్పటికీ చట్టవిరుద్ధంగా లాభాలు పొందుతూ సమాజంలో కలహాలు రేపే వారి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని, వాటిని జారీ చేసిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని పివిఎన్ మాధవ్ కోరారు.

# శ్రీసీతారాముల కల్యాణం కమనీయం రమణీయం





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే... రామనామ స్మరణతోనే సర్వపాపాలు తొలిగిపోతాయనేది ప్రతీతి. అటువంటి మహనీయుని జన్మదినోత్సవమైన చైత్రశుద్ధ నవమి, పునర్వసు నక్షత్ర, శుక్రవార శుభఘడియలలో కల్యాణ రాముడిగా, సీతమ్మవారిని పరిణయమాడిన వేడుకను భక్తులు ఆర్తిమీర తిలకించి పులకరించారు.

హనుమాన్ చౌక్ లోని శ్రీ సీతారామ మందిరం ప్రాంగణంలో 94వ, వసంత నవరాత్రుల ఉత్సవములలో భాగంగా, చైత్రశుద్ధ నవమి శుభఘడియలలో, శ్రీ సీతారాముల కళ్యాణం మంచి ముత్యాల తలంబ్రాలతో, వేదమంత్రాలతో, అశేష భక్తజన సందోహం నడుమ కన్నుల పండువగా నిర్వహించారు.

శ్రీరామనవమి పండుగ ప్రాధాన్యత క్రమంలో 14 రోజులు నిర్వహించే వసంత నవరాత్రి ఉత్సవములు, ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి. బోస్ రోడ్ లోని సీతారామ మందిరం వద్ద, శ్రీ సీతారాముల కళ్యాణం, కమనీయం రమణీయం అన్న తీరుగా నిర్వహించారు. జంధ్యాల భగవాన్ శ్రీనివాస విద్యాధర్, రజిత దంపతులు, పీటలపై ఆశీనులై, కల్యాణం జరిపించారు. 4కేజీల మంచి ముత్యాలు తలంబ్రాలు పోసి, కల్యాణ వైభవాన్ని చాటారు. కల్లూరి వెంకట సూర్యనారాయమూర్తి కార్యక్రమాల కార్యాచరణను వివరించారు. పాలక వర్గం కార్యక్రమాలను పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవం తిలకించే భక్తులకు లడ్డు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం కల్యాణ రాముడిని దర్శించిన భక్తులకు, కల్యాణంలో సమర్పించిన మంచి ముత్యాలు పంపిణీ చేశారు. కోలాహల వాతావరణంలో ఉత్సవాలు ఆహ్లాదంగా కొనసాగాయి, విశేషంగా భక్తులు శ్రీ సీత రామ మందిరానికి చేరుకోవడంతొ,నవమి ఉత్సవ శోభ అంబరాన్ని తాకింది. మెయిన్ రోడ్ లోని, గాడిభావి సెంటర్ లో, గల శ్రీసీతా రామాంజనేయ స్వామి ఆలయం 107సంవత్సరాలుగా ఆద్యాత్మిక ఆనందాన్ని పంచుతున్న క్రమంలో, త్రయాహ్నిక దీక్షగా ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కోగంటి రాంబాబు, ఆలయ అధికారులు కల్యాణ ఉత్సవాన్ని పర్యవేక్షించారు. అదేవిధంగా నందుల పేటలో శిల్పాల శ్రీను ఆధ్వర్యంలొ శ్రీరామ నవమి ప్రాధాన్యతను పెంచే తీరుగా శ్రీ సీతారాముల కల్యాణం ఆబాల గోపాలాన్ని అలరించింది. జనసేన పార్టీ శ్రేణులు విశేషంగా పాల్గొన్నారు. 15వార్డు, పాత ఆర్టీసి డిపో సెంటర్ లొ నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వర్రావు ఆత్మీయ అతిధిగాపాల్గొన్నారు. 24వ, వార్డు పరిదిలొ మాజీ కౌన్సిలర్ నల్లగొర్ల నాగేశ్వరావు ఆద్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని త్రీ టౌన్ సి ఐ ఎస్. సాంబశివరావు ఆత్మీయ అతిధిగా పాల్గొని ప్రారంభించారు. మారీస్ పేట అప్పల స్వామి గుడిలో వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం, మంచి ముత్యాల తలంబ్రాలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ వంశపారం పర్య ధర్మకర్త లంక శివాంజనేయ ప్రసాద్ ఉత్సవాలను పర్యవేక్షించారు. రామస్వామి పేటలోని పట్టాభిరామస్వామి ఆలయంలో ప్రధాన అర్చక స్వామి వి. నాగమారుతి ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకట మల్లేశ్వరి, పాలక మండలి కార్యవర్గం ఉత్సవాలను పర్యవేక్షించారు. అదేవిధంగా ముత్యం శెట్టిపాలెంలోని కోదండ రామాలయంలొ, ఆర్టీసి బస్ డిపోలో, తొలిసారిగా హిందూ జాగృతి సభ్యుల ఆద్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ రాజశేఖర్ దంపతులు అతిధులుగా పాల్గొని కల్యాణం తిలకించారు. మండలంలోని అంగలకుదురు దాసకుటి ఆశ్రమంలో, ఆశ్రమ నిర్వాహకులు శ్రీసీతారామ స్వామి పర్యవేక్షణలో శ్రీతారాముల కల్యాణం ప్రాధాన్యతను సంతరించుకుంది. శ్రీ వాసుదాస స్వామి, ఒంటిమిట్ట రామాలయాన్ని, భక్తీమీర తీర్చిదిద్దిన తీరును భక్తులకు వివరించారు. ఊరువాడ ఉల్లాసంగా రాములవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

## బీజేపీ కార్యాలయంలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీరామ నవమి సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం నేతృత్వంలో నవమి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు బీజేపీ రాష్ట్ర నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పూజా అనంతరం భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఈ వేడుకల్లో బీజేపీ హెడ్క్వార్టర్స్ ఇన్‌చార్జి, బార్ కౌన్సిల్ సభ్యులు ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మజ, ప్రవీణ్ రంకా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు శ్రీరాముని ఆరాధిస్తూ రాష్ట్ర ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

# మారుతున్న భారత్... సవాళ్ల మధ్య ముందుకు సాగుతున్న దేశం

○ అభివృద్ధి, ఆవిష్కరణ, సమగ్రత వైపు భారతదేశం అడుగులు

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం ఒకటిగా నిలుస్తోంది. ఆర్థిక, సాంకేతిక, సామాజిక రంగాలలో దేశం ముందుకు సాగుతున్నప్పటికీ, కొన్ని సవాళ్లు కూడా ఎదుర్కొంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ అభివృద్ధి మరియు సమగ్రత మధ్య సమతుల్యతను సాధించడానికి కృషి చేస్తోంది.

ఆర్థిక రంగంలో భారతదేశం విశేషమైన పురోగతిని సాధిస్తోంది. ప్రపంచంలోనే ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదుగుతున్న భారత్, స్టార్టప్‌లు, డిజిటల్ లావాదేవీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ముఖ్యంగా "డిజిటల్ ఇండియా" కార్యక్రమం దేశాన్ని టెక్నాలజీ వైపు నడిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్, డిజిటల్ సేవలు విస్తరించడం ఒక కీలక పరిణామం.

అయితే అభివృద్ధి ప్రయాణంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ రంగంలో సమస్యలు వంటి అంశాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం ముందు ఉన్న ప్రధాన సవాలు. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాలలో మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచానికి ఒక ముఖ్య కేంద్రంగా మారుతోంది. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో దేశం ముందంజలో ఉంది. యువతలో ఉన్న ప్రతిభ, ఆవిష్కరణ శక్తి దేశ అభివృద్ధికి బలంగా మారుతోంది. అయితే టెక్నాలజీ వినియోగంలో భద్రత, గోప్యత వంటి అంశాలపై కూడా అవగాహన పెంపొందించాలి.

సామాజిక రంగంలో సమానత్వం, సమగ్రత ముఖ్యమైన అంశాలుగా నిలుస్తున్నాయి. మహిళల సాధికారత, విద్య, ఆరోగ్య రంగాలలో పురోగతి కనిపిస్తున్నప్పటికీ, ఇంకా కొన్ని ప్రాంతాలలో అసమానతలు కొనసాగుతున్నాయి. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

పర్యావరణ పరిరక్షణ కూడా ప్రస్తుత కాలంలో కీలక అంశంగా మారింది. వాతావరణ మార్పులు, కాలుష్యం, నీటి కొరత వంటి సమస్యలు దేశాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పచ్చదనం, పునరుత్పాదక శక్తి వనరుల వినియోగం పెంచడం అత్యవసరం.

ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఒక వైపు అభివృద్ధి దిశగా వేగంగా సాగుతుండగా, మరోవైపు సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ రెండు మధ్య సమతుల్యతను సాధించడం ద్వారా మాత్రమే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, ప్రజలు కలిసి పనిచేస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది. బాధ్యతాయుత పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలి.

సమగ్రత, సత్యం, కృషి -- ఇవే భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానానికి తీసుకెళ్లే మూలస్తంభాలు.

భవిష్యత్తులో భారతదేశం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవాలంటే, అభివృద్ధితో పాటు విలువలను కూడా పరిరక్షించాలి. ఈ దిశగా ప్రతి పౌరుడు చైతన్యవంతంగా ముందుకు రావాలి.



రచన:
వై.వి. సుబ్బారావు,
ఎంబీఏ, ఎంఏ (జర్నలిజం)

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467